క్లుప్తంగా

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నేడు శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు సచివాలయం ప్రాంగణంలో మంగంపేట ఆర్‌ఆర్‌- 1 పునరావస గ్రామ ప్రజలకు ఇంటి పట్టాల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు మండలంలోని సిద్దవరం గ్రామానికి నేడు శుక్రవారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పంచాయతీలోని సచివాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

మందులతో క్షయవ్యాధి నయం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె : క్షయవ్యాధిని మందులతో పూర్తిగా నయం చేయవచ్చునని వైద్యులు మమత, నజియాలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో క్షయవ్యాధి వారోత్సవాలలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారాలపాటు దగ్గు, సాయంకాలం వేళల్లో జ్వరం, బరువు తగ్గడం, ఆకలి వేయకపోవడం, చెస్ట్ పెయిన్ వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాల్నారు. క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మొండి టీబీగా మారుతుందని, రెండు సంవత్సరాలపాటు మందులు వాడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నరేంద్ర రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ హరి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ



పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ

నందలూరు(రాజంపేట) : జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ వీఎస్‌కే చైతన్య, మన్నూరు సీఐ మంజునాథ రెడ్డిల ఆదేశాల మేరకు గురువారం పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించినట్లు ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నందలూరు పంచాయతీ పరిధిలోని 90, 91, 92 పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులను పరిశీలించినట్టు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలకు లోను కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్‌ఐ వెంట పోలీసులు దర్బార్ బాషా, మహేంద్ర, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో గిరిజనులకు అవకాశాలు



ట్రైకార్ చైర్మన్ గుండా సురేంద్రను సన్మానిస్తున్న గిరిజన నాయకులు

సంబేపల్లె : గిరిజన యువతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచి అవకాశాలు అందుతున్నాయని గిరిజన సంఘం నాయకులు శంకర్ నాయక్, విశ్వనాథ నాయక్‌లు అన్నారు. గురువారం మండలంలోని మోటకట్ల గ్రామానికి చెందిన గుండా సురేంద్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్‌గా నియమితులై సొంత గ్రామానికి రావడంతో పెద్దసంఖ్యలో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ఉపాధ్యాయ నాయకులు శేఖర్, మోహన్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ వెంకటరమణ, గిరిజన నాయకులు బొజ్జప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం కలశారాధన, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మూల విరాట్టుకు అభిషేకం, అర్చన, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పీఎస్ చైతన్య ఆలయ ప్రధాన అర్చకులు ఎంఆర్‌ఎన్‌పీ కుమార శర్మ, శివకుమార్‌శర్మ పాల్గొన్నారు.

రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపించా

- ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది
- మరోసారి అవకాశం ఇస్తే రెట్టింపు ఉత్సాహంతో పని
- ఆశీర్వదించండి.. అభివృద్ధికి పట్టం కట్టండి
- నాయునివారిపల్లెలో పూజలనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- భారీ సంఖ్యలో తరలివచ్చిన నియోజకవర్గ పార్టీ శ్రేణులు



రామాపురం: ప్రచార పర్వం ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో హాజరైన శ్రేణులు



రాయచోటి: ప్రచారంలో ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్న మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం

రామాపురం/రాయచోటి : నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు సంక్షేమం, వారి కష్ట సుఖాలలో తోడుగా నిలిచిన తనకు మాత్రమే ఈ ఎన్నికలలో ఓటు అడిగే హక్కు ఉందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాచపల్లె గ్రామంలోని నాయునివారిపల్లెలోని వీరనాగమ్మ ఆలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచార పర్వాన్ని ప్రారంభించారు. నాయునివారిపల్లె, పోలిమేరపల్లె, ఎగువ ఉప్పరపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించామని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డిలను మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

అక్కున చేర్చుకున్న రాచపల్లె గ్రామస్తులు

ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని రాచపల్లె గ్రామం అక్కున చేర్చుకుంది. ఇంటింటా మహిళలు కర్పూర హారతులు పట్టగా, కార్యకర్తలు, నాయకులు గజమాలలు వేసి ఆత్మీయ స్వాగతాలు పలికారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటా తాము చేసిన అభివృద్ధిని తెలుపుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జగన్‌ను మరోసారి సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ రాచపల్లె గ్రామస్తులు ముక్తకంఠంతో ఆయనకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలకు స్వస్తి చెబుతూ, కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రాయచోటి ప్రాంతానికి కృష్ణా జలాలు అందించే జీఎన్‌ఎస్‌ఎస్ - హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పథకం పనులు 80 శాతం మేర పూర్తి అయ్యాయని చెప్పారు. కృష్ణా జలాలను ఈ ప్రాంతానికి తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. పోతిరెడ్డిపాడు అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఎంతో కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు ఏకమై కృష్ణాజలాలను జగన్ తీసుకెళ్తున్నారని ముకుమ్మడిగా దాడి చేస్తున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టులతో అనంతపురం రూపురేఖలు మారాయన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత రూపురేఖలు కూడా మారుతాయన్నారు.

చేసిన పనులు చెప్పే దమ్ము ఉంది..

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాము ఏమేమి పనులు చేశామో చెబుతున్నామని, టీడీపీ హయంలో చేసిన అభివృద్ధి పనులు ఏంటో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క మంచి పని చేయలేదన్నారు. వర్గ పరిధిలో సిమెంటు రోడ్లు, తారురోడ్ల నిర్మాణాలు, ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ శాశ్విత భవనాలు నిర్మించి ప్రజల చెంతకే పాలన, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. నాలుగో సారి ఎన్నికల బరిలోకి దిగుతున్న తనను ప్రజలు ఆశీర్వదించాలని ప్రార్థించారు. నియోజకవర్గ కేంద్రానికి జిల్లా కేంద్రంతో పాటు అనేక సదుపాయాలు కల్పించానని రాబోయే రోజుల్లో ప్రజల ఆశీర్వాదాలతో మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు.



రామాపురం: శ్రీకాంత్‌రెడ్డికి హారతులతో నీరాజనలు పలుకుతున్న మహిళలు



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దంపతులు

ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

నియోజకవర్గంలో మంచి పనులు చేసి, ప్రజలకు ఎల్లవేళలా తోడుగా నిలిచినందునే ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు జరిగి ఉంటేనే తమకు అండగా నిలవాలని తమ అధినేత జగన్ చెబుతున్నారన్నారు. వ్యక్తిగత విమర్శలకు తాను ఎప్పుడూ చోటు ఇవ్వలేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో ఒక లక్ష కుటుంబాలను కలిసి ప్రజల కష్ట, సుఖాలలో పాలుపంచుకున్నామన్నారు. గత ఎన్నికలలో చంద్రబాబు ఆరు వందలకు పైగా హామీలిచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోవడమే కాకుండా, మ్యానిఫెస్టోను సైతం ఆన్‌లైన్‌లో లేకుండా చేశారన్నారు. అదే జగన్ తన ఐదేళ్ల పాలనలో 99శాతం హామీలు ఇచ్చి, ఇంటింటికీ మ్యానిఫెస్టోను పంపిస్తున్నారన్నారు. కాగా ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవంలో నియోజవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకీయా ఖానం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, బీసీ సెల్ విజయభాస్కర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీంద్రనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

- రూ.45 కోట్లతో నిర్మించే చిట్వేలి - కోడూరు డబుల్ రోడ్డు పనులు ప్రారంభం
- పాల్గొన్న విప్ కొరముట్ల, ఏపీఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

చిట్వేలి : చిట్వేలి - రైల్వేకోడూరు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.45 కోట్లతో నాగవరం ప్రధాన రహదారి వద్ద గురువారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటు అందిస్తోందన్నారు. మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల నెరవేరడం ఆనందంగా ఉందన్నారు. అడిగిన వెంటనే రూ.45 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల కన్వీనర్ చెవ్వ శ్రీనివాసులు రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, ఉమామహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు మలిశెట్టి వెంకటరమణ, ముజీబ్, తోట శివ సాయి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, జెడ్పీటీసీ రత్నమ్మ, ఆర్‌అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, విక్రమరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి పూజలు

పుల్లంపేట : మండల కేంద్రంలో కొలువైన సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలువురు సాయినాథుని భక్తులు ఆలపించిన భక్తిపాటలు అలరించాయి. అనంతరం తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో వేద పండితులు, గ్రామస్తులు

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లి గ్రామస్తులు తమ సొంత నిధులు రూ.50లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గురువారం మహాగణపతి, సుబ్రహ్మణేశ్వర, హనుమాన్ సమేత సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహకులు, ప్రజలు తెలిపారు. గత మూడు రోజులపాటు వేద పండితులచే ఆలయంలో ప్రాతఃకాల పూజ, ప్రతిష్ట హోమం తదితర పూజా క్రతువుల అనంతరం సర్వదర్శనం, సీతారామ కల్యాణోత్సవం తీర్థప్రసాద వినియోగం చేశారు. మూడు రోజులపాటు జరిగిన పూజల్లో హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న జడ్జీ

సిద్దవటం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ శ్రీనివాస కళ్యాణ్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో గురువారం 2024 విద్యా, వైజ్ఞానిక సంబరాల కార్యక్రమాన్ని జడ్జీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల, చట్టాల పట్ల విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఎంతో నైపుణ్యంతో ప్రాజెక్టులు తయారు చేశారన్నారు. సైన్స్ పట్ల అవగాహన కలిగే విధంగా యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందని అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఎంఈఓ శంకరయ్య, కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య, పాఠశాల డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఓ రాజశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగేశ్వరి, కోర్టు సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

సిద్దవటంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ సాయి హైస్కూల్ లో జాతీయ సైన్స్ సంబరాల్లో భాగంగా ప్రతిభ చాటిన విద్యార్థులకు సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ శ్రీనివాసకళ్యాణ్ చేతులమీదుగా బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి పౌరులని జాతీయ సైన్స్ సంబరాల్లో ప్రాజెక్టులు తీర్చిదిద్దడంలో విద్యార్థులు నైపుణ్యంగా వ్యవహరించారన్నారు. బహుమతులు పొందిన వారు గొప్ప అని, మిగతా వారు తక్కువని కాదు అందరూ నైపుణ్యంతో వివిధ రకాల ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు అద్భుతంగా తయారు చేశారని విద్యార్థులను కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, చైర్‌పర్సన్ రేవతీదేవి, హెచ్‌ఎం రాజేష్, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాయచోటి అర్బన్ : ఏపీ ప్రభుత్వం రద్దుచేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీం బాషాలు డిమాండ్ చేశారు. తమ సంఘం రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు గురువారం భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు 22లక్షల మంది కార్మికులను సభ్యులుగా నమోదు చేసుకుని సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో 32వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడంతో కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి గంగాధర్, నేతలు సికిందర్, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, వెంకటయ్య, వెంకటేష్, సుబ్రమణ్యం, హుస్సేన్, బాలక్రిష్ణ, ప్రసాద్, గఫూర్, రియాజ్, మహబూబ్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కోరారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం కేవీపల్లెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధిపొందిందని తెలిపారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, గజ్జెల శీనురెడ్డి, యర్రమరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



జెండా ఊపి ప్రచార ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి శ్రీకాంత్ రెడ్డి విజయానికి కృషి చేయాలని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దిన్నెపాటి గజేంద్రారెడ్డిలతో కలిసి రామాపురం నాయినవారిపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి నిర్వహించనున్న ఎన్నికల ప్రచారానికి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మోహన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి శ్రీకాంత్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

రాయచోటి-లక్కిరెడ్డిపల్లె మార్గ మధ్యలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వెనుక భాగంలో నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డిలతో కలిసి మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.

'విలువలు లేని వ్యక్తి చంద్రబాబు'



వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాజకీయంగా విలువలు లేని వ్యక్తి చంద్రబాబు నాయుడు అని సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అక్రమంగా అధికారంలోకి వచ్చాడని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి విమర్శించారు. గురువారం కొర్లకుంటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌కు ముష్టివేసినట్లు 24 సీట్లు ఇచ్చాడని కాపులు పవన్ కల్యాణ్‌కు పట్టం కట్టాలని కలలు కంటే చంద్రబాబు నాయుడు వారి ఓట్లతో అధికారంలోకి వచ్చేందుకు పవన్‌తో పొత్తు పెట్టుకున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 24 మంది కాపులకు సీట్లు ఇచ్చారని అన్నారు. ఈ విషయన్ని కాపు సోదరులు గమనించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులకు పేద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అందించారని తెలియజేశారు. రైల్వేకొడూరు రాజకీయాల్లో ఎన్నో సంవత్సరాలు పార్టీకి పనిచేసిన టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడుని పక్కన పెట్టి చంద్రబాబునాయుడు కేవలం డబ్బు కోసం అమ్ముడుపోయి కొత్తగా పార్టీలో చేరిన ముక్కా రూపానందరెడ్డికి పదవిని కట్టపెట్టాడని విమర్శించారు. విలువలు లేని రాజకీయాలు, మోసాలు, వెన్నుపోట్లు చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యా అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుపొందుతుందని సాయికిషోర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీ, మౌలాకా పహాడ్ వద్ద జెడ్పీ ఉన్నత ఉర్దూ పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జక్రియాఖానమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సేవలను అందించడం హర్షనీయమన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జీ బాబాఫకృద్దీన్

సిద్దవటం: సిద్దవటం - భాకరాపేట రహదారిలోని మార్గ మధ్యలో ఉన్న పరమాత్మ సేవా తపోవన వృద్ధాశ్రమాన్ని గురువారం కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి ఆశ్రమంలో ఉన్న సీనియర్ సిటిజన్‌లను పలకరించి వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం - 2007 ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి - 2011ను వివరించారు. సంరక్షణ భద్రత కల్పించవలసిన వృద్ధులను విడిచిపెట్టినా, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, అట్టి వారు శిక్షా అర్హులు అవుతారని, తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి దృష్టికి తీసుకు రావచ్చునని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు మలిశెట్టి వెంకటరమణ, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

నకిలీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- విద్యార్థులకు వినియోగదారుల చట్టంపై అవగాహన
- పాల్గొన్న నాయకులు, స్టాండర్డ్స్ క్లబ్ సభ్యులు



విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

సంబేపల్లె : తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రస్తుతం అమలులో ఉన్న వినియోగదారుల చట్టం-2019 గురించి వినియోగదారులంతా అవగాహన పెంపొందించుకోవాలని రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి కోరారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) వారి ఆధ్వర్యంలో గురువారం జెడ్పీహెచ్‌ఎస్ స్టాండర్డ్స్ క్లబ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చైర్మన్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించడం శుభ పరిణామమన్నారు. దశాబ్దాలుగా ప్రకటనలకే పరిమితమైన స్కూల్ కన్జ్యూమర్ క్లబ్‌లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి స్కూల్‌లోనూ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులే వినియోగదారులుగా తమ హక్కులను అర్థం చేసుకోవడంతోపాటు వాటిని తమ కుటుంబ సభ్యులకు, గ్రామాల్లోని నిరక్షరాస్యులకు తెలియజేసేందుకు ప్రభుత్వం ఈ క్లబ్‌లకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏదైనా ఒక వస్తువును కొనుగోలు చేసినప్పుడు, లేదంటే సేవను పొందేటప్పుడు వినియోగదారుడికి చట్టం కొన్ని హక్కులు కల్పించిందన్నారు. వీటి ద్వారా మోసాల నుంచి కొనుగోలుదారుడు తనను తాను రక్షించుకోవచ్చన్నారు. అనంతరం స్టాండర్డ్స్ క్లబ్ మెంటర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యత ప్రమాణాలు గురించి తెలుసుకోవడానికి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ స్టాండర్డ్ క్లబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భారతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా సమాజంలోని ఏ వస్తువు నకిలీదో, ఏది ఒరిజినల్ అనే విషయమై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుంటారన్నారు. స్టాండర్డ్ క్లబ్ మెంటర్ ముదిశెట్టి రెడ్డి శేఖర్ మాట్లాడుతూ స్టాండర్డ్ క్లబ్ గురించి అవగాహన కల్పించడంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందనిఅందులో ప్రథమ బహుమతిగా రుక్సానా రూ. 1000లు, ద్వితీయ బహుమతిగా సాయి శరణ్య రూ. 750లు, తృతీయ బహుమతిగా హర్షిత రూ. 500లు, ప్రోత్సాహక బహుమతులుగా ఆదిత్య వర్దన్ నాయక్‌కు రూ. 250లు అందించడంతోపాటు మెమెంటో, సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డయ్య రెడ్డి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయులు జోసెఫ్, తెలుగు ఉపాధ్యాయులు మాబు హుస్సేన్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.